క్లుప్తంగా

సీనియర్ అకౌంటెంట్‌కు సత్కారం



సీనియర్ అకౌంటెంటు పుష్పవల్లిని సత్కరిస్తున్న ఏపీజీఎల్ఐ అధికారులు, సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని ఏపీజీఎల్ఐ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తూ అనంతపురం జిల్లా బీమా కార్యాలయానికి బదిలీ అయిన పుష్పవల్లిని కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. సోమవారం బదిలీ అయిన సీనియర్ అకౌంటెంటును ఏడీ గౌరిప్రసన్న రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి వీడ్కోలు పలికారు. పర్యవేక్షకులు పి.రామకృష్ణారెడ్డి, మాధవీ కళ్యాణి, సిబ్బంది మద్దిలేటి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కర్నూలు: కర్నూలు శివారు జొహరాపురం రోడ్డులో అశ్విని ఆసుపత్రి సమీపంలో ఫుట్‌పాత్‌పై అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని, ఛామన ఛాయ వర్ణం ఉన్నట్లు తెలిపారు. నీలం రంగు చొక్కా, ముదురు నీలం రంగు ప్యాంటు, పింక్ రంగు బనియన్ ధరించి ఉన్నట్లు చెప్పారు. సమాచారం తెలిసినవారు 91211 01061 లేదా 08518-277187 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని మూడో పట్టణ పోలీసులు కోరారు.

నగరపాలక సంస్థ ఈఈ బదిలీ

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరపాలక సంస్థలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా (ఈఈ) విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా సోమవారం రాత్రి ఆయనను ఆదోని మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో గుంతకల్ మున్సిపాలిటీలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న లీలా కృష్ణ ప్రసాద్‌ను కర్నూలు కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. అలాగే కుడాలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌కు మార్‌ను (ఏపీఎస్‌డీఎంఏ) అనంతపురంకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపాల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతా ల నుంచి భక్తు లు తరలివచ్చా రు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకుంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ అమలు

కర్నూలు(సెంట్రల్): జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ ద్వారా జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమ వారం సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు నాయుడు 26 జిల్లాల విజన్ యాక్షన్ ప్లాన్ యూ నిట్ కార్యాలయాలు, 175 నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్‌ల కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి, జేసీ డాక్టర్ బి.నవ్య కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని మంత్రి ఫిజికల్‌గా ప్రారంభించారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్ ప్లాన్ అమలులో భాగంగా ఈ కార్యాలయాలను ప్రారంభించినట్లు చెప్పారు. సీపీఓ హిమ ప్రభాకరరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

- పూడికతీత పనులు చేపట్టాలి
- కేసీ కెనాల్ రక్షణ వలయాన్ని బాగు చేయండి
- కమిషనర్‌కు పలువురి వినతి



కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రాలు ఇస్తున్న వివిధ కాలనీలకు చెందిన అర్జీదారులు

కర్నూలు (టౌన్): స్టాంటన్‌పురంలో మురుగు కాల్వలపై ఆక్రమణలు తొలగించి పూడికతీత పనులు చేపట్టాలని స్థానికులు హనీఫ్, సుధాకర్ రెడ్డి విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ రవీంద్రబాబు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నిర్దేశిత గడువులోపు సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, పారిశుద్ధ్య అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- మద్దూరు నగర్‌లోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో తమ అద్దె తగ్గించాలని లీజుదారుడు ప్రసాద్, విశ్వేష్‌బాబు, జి.కళ్యాణి విన్నవించారు.
- శ్రీ చక్ర హాస్పిటల్ సమీపంలోని తమ పంచరత్న కాలనీలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని స్థానికులు మురళీ మోహన్, చంద్రావతి, శేషు కుమార్ కోరారు.
- రాజీవ్‌నగర్, బృందావన్ నగర్ కాలనీలో సీసీ రహదారి, డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని స్థానికులు బాలక్రిష్ణ, వీరేష్, శ్రీనాథ్ అభ్యర్థించారు.
- 45వ వార్డు పరిధిలోని ఎల్లమ్మ గుడి వద్ద కేసీ కెనాల్ రక్షణ వలయానికి మరమ్మతులు చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ బి.మాణిక్యమ్మ కోరారు.
- శకుంతల కళ్యాణ మండపం నుంచి హోండా షోరూం వరకు పూడికతీత చేపట్టాలని శివశంకర్, సమీర్, రాఘవేంద్ర కోరారు.
- ఎల్బీజీ నగర్‌లో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాల్వల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు సరిత, రాజు, బాషా అభ్యర్థించారు.

కక్ష సాధింపునకే కొమ్మినేని అరెస్టు

- ఇది మంచి సంప్రదాయం కాదు
- వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి



మాట్లాడుతున్న తెర్నేకల్ సురేందర్ రెడ్డి

కర్నూలు (టౌన్): రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును చంద్రబాబు ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక సీతారామ నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ‘సాక్షి’ మీడియా వేదికగా కేఎస్‌ఆర్ లైవ్ షో ద్వారా ప్రజల సమస్యలను కొమ్మినేని వెలుగులోకి తెస్తున్నారన్నారు. ఆయన 18 సంవత్సరాలుగా అనేక టీవీ ఛానళ్లలో పనిచేసిన అనుభవం ఉన్న జర్నలిస్టుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితుడని అన్నారు. ఆయనకు సంబంధం లేకున్నా కేవలం చర్చలో ఉన్నాడన్న అక్కసుతో అక్రమంగా కేసు నమోదు చేయడం, అరెస్టు చేయడం దారుణమని మండిపడ్డారు. లైవ్ డిబేట్‌లో క్రిష్ణంరాజు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే కొమ్మినేనిని అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం ఈ ఘటనను వాడుకుంటోందని, తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను రెచ్చగొడుతోందని విమర్శించారు. అలాగే చంద్రబాబు సర్కార్ ‘సాక్షి’ మీడియాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఏపీలో పత్రికా స్వేచ్ఛ ఉందా? మీడియా గొంతు నొక్కడమే చంద్రబాబు లక్ష్యమా? అని ప్రశ్నించారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా పట్టించుకోని పోలీసులు.. కొమ్మినేని విషయంలో ఆగమేఘాలపై స్పందించడం కుట్రలో భాగమే అన్నారు.

యోగా జీవితంలో భాగం కావాలి



యోగాంధ్ర ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): దైనందిన జీవనంలో ప్రతి ఒక్కరూ యోగాను భాగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య జిల్లా ప్రజలకు సూచించారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం ఉదయం కలెక్టరేట్ గాంధీ విగ్రహం నుంచి రాజ్‌విహార్ వరకు నిర్వహించిన మాస్ ర్యాలీని ఆమె రంగుల బెలూన్లను గాలిలోకి వదిలి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లో యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. యోగాపై రంగోలి, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మనసును ప్రశాంతంగా ఉంచుకొని రోగాలను దూరం చేసుకోవడానికి యోగా గొప్ప మార్గం అన్నారు. మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డీటీసీ శాంతకుమారి, డీఎస్ఓ రాజారఘువీర్, డీఎంహెచ్ఓ శాంతికళ, హౌసింగ్ పీడీ చిరంజీవి, డీసీఓ రామాంజనేయులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): రైతులకు 90 శాతం సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి దంబోళ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 10 రోజులు గడిచినా రైతులకు విత్తనాలు, ఎరువులను అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇంతవరకు విత్తనాలను కూడా కొనుగోలు చేయలేదని అరకొరగా కొనుగోలు చేసిన వాటిని గ్రేడింగ్ చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. మరోవైపు రైతులకు నకిలీ విత్తనాల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై సరైన పరిశీలన చేయకుండా మార్కెట్‌లోకి వదులుతుండడంతో వాటిని విత్తి అన్నదాతలు నష్టపోతున్నారన్నారు. మరోవైపు అన్నదాత సుఖీభవను వెంటనే విడుదల చేసి రైతుల ఖాతాల్లో రూ.20 వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. చాలా బ్యాంకులు రైతులకు క్రాప్‌లోన్‌లు ఇవ్వడం లేదని, ఇచ్చినా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పెంచడం లేదని, దీంతో చాలా మంది రైతులకు సరైన రుణాలు రావడం లేదన్నారు. నాయకులు బీసన్న, రబియా, విజయుడు, భీముడు, మునెమ్మ, కోటమ్మ, చాంద్, బుడ్డల బువ్వమ్మ, జ్యోతి, వీరయ్య పాల్గొన్నారు.

టీబీ ముక్త భారత్ లక్ష్యం కావాలి



సంచార వాహనం వద్ద డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టీబీ ముక్త అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ విముక్త భారత్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కర్నూలు మండలం ఇ.తాంద్రపాడు పీహెచ్‌సీ పరిధిలోని ఉల్చాల గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు, బరువు తగ్గిపోవడం, 60 ఏళ్లు పైబడిన వారు, పొగ తాగేవారు, మద్యం సేవించేవారు, పౌష్టికాహార లోపం ఉన్న వారందరికీ టీబీ గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించాలన్నారు. ఇందులో భాగంగా నిక్షయ్ వాహన్, నిక్షయ్ శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు టీబీ గురించి అవగాహన కల్పించాలన్నారు. నిరుపేద టీబీ రోగులకు దాతల సహకారంతో ప్రతి నెలా పౌష్టికాహారం అందజేయాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ హేమలత, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ విద్యాసాగర్, డిస్ట్రిక్ట్ స్టాఫ్ ఉమాపతి, టీబీ సూపర్‌వైజర్ నిషిత్, ఇమ్రాన్, ఎంఎల్‌హెచ్‌పీ విశాల పాల్గొన్నారు.

అత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

కర్నూలు(అర్బన్): మహిళలు, చిన్నారులు, విద్యార్థులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి తీవ్రంగా ఆరోపించారు. ఆమె సోమవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. సత్యసాయి జిల్లాలో దళిత మైనర్ బాలికపై జరిగిన సామూహిక అత్యాచార సంఘటన మరువక ముందే, అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థినిని హత్య చేసిన నిందితుల్ని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతపురం రామకృష్ణ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటన బాధాకరమన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హింసను అరికట్టే చర్యల్లో పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. దేశవ్యాప్తంగా అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నా, పాలకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. అత్యాచారాలు, హత్యలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఏర్పాటు చేసి బాధిత మహిళలకు సత్వర న్యాయం అందేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా మూడు నెలల్లో కేసు విచారణ జరిపి నిందితుల్ని చట్ట ప్రకారం శిక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కేసు నమోదు చేయాలి



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : దళితుడిపై దాడిచేసి 6రోజులు గడుస్తున్నా దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయకపోవడం పోలీసుల వైఫల్యమేనని జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ మండిపడ్డాడు. సోమవారం బాధితుడితో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని మేకడోణ గ్రామానికి చెందిన దళిత అయ్యప్పపై అదే గ్రామానికి చెందిన మైనార్టీ కులానికి చెందిన ఏడుగురు గత 4వ తేదీన పొలం వద్ద గొడవపడి మూకుమ్మడిగా దాడి చేశారన్నారు. దాడిలో గాయపడిన అయ్యప్ప ఆదోని ఏరియా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకొని 5వ తేదీన పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కంప్‌లైంట్ చేశాడని, అయినా నేటికీ పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. దీనికి కారణం వారికి కూటమి నాయకుల అండదండలు ఉండటంతోనే అని ఆరోపించాడు. దాడికి పాల్పడ్డ వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ ఇచ్చేంతవరకు ఇక్కడ నుంచి కదిలేదే లేదని స్టేషన్ ముందే భీష్మించుకుకుర్చున్నారు. జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు తాలూకా అధ్యక్షుడు శావల బుజ్జి, పెద్దకడబూరు మండల నాయకులు యోహాన్, ఆదాము, ప్రభాకర్, సిమోను, అనిల్, కర్ణ. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇస్కాన్‌లో కదళీ ఫలోత్సవం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ జగన్నాథ స్వామి మందిరంలో ఈ నెల 11వ తేదీ కదళీ (అరటి పండ్లు) ఫలోత్సవం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు తెలిపారు. జ్యేష్ఠ పూర్ణిమ శ్రీ జగన్నాథ్ స్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని స్వామివారి స్నాన యాత్ర సందర్భంగా కదళీ ఫలోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవంలో అరటి పండ్లను సమర్పించాలనుకునే వారు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇస్కాన్ మందిరంలో సమర్పించ వచ్చని విజ్ఞప్తి చేశారు.

మాజీ సైనికుడి మృతి

కర్నూలు(అర్బన్): నంద్యాల జిల్లా వెలుగోడు మండలం అబ్దుల్లాపురానికి చెందిన మాజీ సైనికుడు డి.మౌలాలి అనారోగ్యంతో మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్రా పేరయ్య తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. మృతి చెందిన మాజీ సైనికుడి కుటుంబానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

నదిలో మునిగి వ్యక్తి మృతి

కర్నూలు: తాగిన మత్తులో బహిర్భూమికి వెళ్లి తుంగభద్ర నీటిలో మునిగి సాయిబాబా సంజీవయ్య నగర్‌కు చెందిన జగ్గుల రాముడు (44) మృతి చెందాడు. ఈయన మున్సిపల్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ కింద స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లిన రాముడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నీటిలో గాలించగా మృతదేహం బయటపడింది. తాగిన మైకంలో నీటిలో మునిగిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయనకు భార్య కృష్ణవేణి, నలుగురు పిల్లలు సంతానం. ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఏడాది తరువాత చోరీ కేసు

పత్తికొండ రూరల్: మండలంలోని దూదేకొండ గ్రామానికి చెందిన కె.వీరారెడ్డి అనే వ్యక్తి తన ఇంట్లో చోరీ జరిగిందని పోలీసు స్టేషన్‌లో గత ఏడాది ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు పట్టించుకోకపోవడంతో వారం రోజుల క్రితం కర్నూలులోని స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. దీంతో రెండు రోజుల క్రితం పత్తికొండ పోలీసులు కేసు నమోదు చేశారని బాధితుడు సోమవారం తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దేవనకొండ: మండలంలోని కరివేముల గ్రామ సమీపంలో మతిస్థిమితం లేని వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి రోడ్డు వెంబడి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న దేవనకొండ ఏఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ రంగన్న ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని పరిశీలించి దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు.

కాంపౌండ్ వాల్‌కు నిధులు కేటాయించాలి

కల్లూరు: ముస్లిం శ్మశాన వాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కల్లూరు అర్బన్‌లోని 26 నుంచి 35 వార్డులకు చెందిన ముస్లిం మతపెద్దలు సోమవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముస్లిం మతపెద్దలు షేర్ ఖాన్, షుకూర్, బాషా, మైనార్టీ నాయకులు ఫిరోజ్, ఖాజామియా, సులేమాన్ తదితరులు ఉన్నారు.

నకిలీ బంగారం అంటగట్టిన వ్యక్తుల అరెస్ట్

దేవనకొండ: నకిలీ బంగారాన్ని అంటగట్టి మోసం చేసిన కేసులో నెల్లూరు జిల్లాకి చెందిన నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ వంశీనాథ్ శనివారం తెలిపారు. ఈనెల 8వ తేదీన మండలంలోని గుండ్లకొండ గ్రామానికి చెందిన కప్పల రంగస్వామికి నెల్లూరుకు చెందిన కొందరు తమకు బంగారం దొరికింది, మీరు తీసుకుంటారా అని నమ్మబలికించి రూ.1,12,000 నగదును తీసుకుని నకిలీ బంగారాన్ని అంటగట్టి పరారయ్యారన్నారు. అది నకిలీ బంగారం అని ఆలస్యంగా గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి నకిలీ బంగారాన్ని అంటగట్టిన నెల్లూరు జిల్లాకు చెందిన నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వివరించారు.

లైఫ్ స్కిల్స్‌తో సామాజిక వ్యక్తిత్వ వికాసం



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: సామాజిక, వ్యక్తిత్వ అభివృద్ధికి లైఫ్ స్కిల్స్ ఉపయోగపడతాయని డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నాలజీ, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రాయపాటి మాట్లాడుతూ.. ఆధునిక కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు టైం మేనేజ్‌మెంట్, టీం వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు కేడీజే బాబు మాట్లాడుతూ.. విద్యతో పాటు జీవన నైపుణ్యాలపై శిక్షణ తీసుకున్న వారు ఉద్యోగ సాధనలో విజయం సాధించగలుగుతారన్నారు. నైస్ సంస్థ, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మాతృమరణాల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ



మాట్లాడుతున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ప్రసవ సమయంలో మాతృ మరణాలు తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ఆమె సోమవారం తన చాంబర్‌లో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. పెద్దహరివాణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గత ఏప్రిల్‌లో సంభవించిన మాతృమరణంపై ఆమె సమీక్షించారు. క్షేత్రస్థాయిలోని సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు గర్భవతులను త్వరగా గుర్తించి వారికి సరైన సమయంలో సమయానుసార వైద్యసేవలు అందించినట్లయితే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని చెప్పారు. ఒకవేళ ఆ గర్భవతులను హైరిస్క్‌గా గుర్తించినట్లయితే ఆశా, ఆరోగ్య కార్యకర్త, పర్యవేక్షకులతో ట్రాక్ చేసి సమీప సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందించినట్లయితే మాతా శిశు మరణాలు తగ్గించవచ్చని చెప్పారు. అంతే గాక హైరిస్క్ గర్భవతిని కాన్పు తేదీకి మూడు రోజులు ముందుగానే ట్యాగ్ చేయబడిన ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, గైనకాలజీ హెచ్ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్లు పద్మజ, సుధీర్ కుమార్, శ్రీనివాసులు, రంగస్వామి, డీపీహెచ్ఎన్ఓ అన్నపూర్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారులు అభిరూప్, ఇర్ఫాన్‌బాషా, పీహెచ్ఎన్ మీనాక్షి, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): మాతాశిశు మరణాలు నివారించే లక్ష్యంతో ప్రతి నెలా 9వ తేదీన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. కర్నూలు మండలం ఇ.తాంద్రపాడు గ్రామంలోని పీహెచ్‌సీలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమం, కిల్కారి మెసేజ్ విధానం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గర్భవతులకు పీహెచ్‌సీ/యుపీహెచ్‌సీలలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ప్రమాదకర చిహ్నాలు ఉన్న వారిని గుర్తించి సమయానుసార ఆరోగ్య సేవలకు ఉన్నత శ్రేణి ఆసుపత్రులకు రెఫర్ చేసి చికిత్సలు అందించేటట్లు చూడాలన్నారు. మాతాశిశు ఆరోగ్య సేవలు బలోపేతం చేయడంలో భాగంగా కిల్కారి మెసేజ్ విధానం ప్రారంభించినట్లు తెలిపారు. దీనిని ప్రతి గర్భిణి, బాలింతలు ఉపయోగించుకోవాలని సూచించారు. వైద్యాధికారిణి డాక్టర్ విజయ మాధురి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి మక్బూల్ సాహెబ్, పబ్లిక్ హెల్త్ నర్సు విమలాదేవి పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు

కల్లూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. సోమవారం మండల పరిధిలోని ఉలిందకొండ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు మాతా శిశు సంరక్షణ కార్డు గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మాతా శిశు మరణాలను సమర్థవంతంగా నివారించాలంటే గర్భిణుల వివరాలు, వారికున్న ఆరోగ్య ఇబ్బందులు, ప్రస్తుతం అందిస్తున్న వైద్యం, ముందు తీసుకోవలసిన జాగ్రత్తలను కార్డులో నమోదు చేయాలన్నారు. మొదటి నెల గర్భిణి అయినప్పటి నుంచి 9వ నెల వరకు, ప్రసవం అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు, అందించిన వైద్యం తదితర వివరాలన్నీ అందులో నమోదు చేయడంతో పాటు, ప్రతి నెలా అవసరమైన వైద్యం అందించాలన్నారు. డాక్టర్ కృష్ణబాయి, ఆరోగ్య విస్తరణ అధికారి విజయకుమార్, వైద్యాధికారులు శ్వేతవాణి, దేవమణి, శోభారాణి, నాగేశ్వరమ్మ, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



ఎల్లమ్మ ఆలయ ఆవరణలో జరుగుతున్న హోమం

వెల్దుర్తి: మండలంలోని యాదరాళ్ల గ్రామంలో టోపుల ఎల్లమ్మ అమ్మవారి బోనాల పండుగ సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమాల్లో భాగంగా వేద పండితులు యార్లపాటి విశ్వంశర్మ బృందం మంత్రోచ్చారణల మధ్య చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి భజన పోటీలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం వరకు పోటీలు కొనసాగనున్నాయి. నేడు అమ్మవారికి బోనాల సమర్పణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

‘ఉక్కు’ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 2500 మంది కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం చేయరాదని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 2500 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 8 నెలల జీతాలు చెల్లించాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్రం ప్రభుత్వం విశాఖ ఉక్కుకు రూ.11 వేల కోట్లు కేటాయించినా కార్మికులకు జీతాలు ఇవ్వలేకపోవడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడకపోతే ప్రజా ఉద్యమం తప్పదన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు భాస్కర్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు విశాఖ ఉక్కును కాపాడుకుంటామని చెప్పి పట్టించుకోవడం లేదన్నారు. కొత్తగా వస్తున్న మిట్టల్ పరిశ్రమకు గనులు కేటాయించాలని కోరుతున్న చంద్రబాబు విశాఖ ఉక్కు పరిశ్రమకు ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, సీఐటీయూ న్యూసిటీ కార్యదర్శి మార్రెళ్ల విజయ్, ఓల్డ్‌సిటీ కార్యదర్శి సాయిబాబా పాల్గొన్నారు.